క్లుప్తంగా

డాక్టర్ కె.పి.చారికి సత్కారం



మాచర్ల: మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి.చారిని స్వచ్ఛాంధ్ర పురస్కారం అందుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైద్యులు, సిబ్బంది సత్కరించి అభినందించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



వెల్దుర్తి: మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 6 నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఖాదర్ పాషా హుస్సేన్ విద్యార్థినులకు పలు సూచనలు అందించారు. మంగళవారం శిరిగిరిపాడు ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకుంటూ, మనస్సును సమతులం చేసుకోవాలన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ధ్యానం, యోగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పాలుపంచుకున్నారు.

నేటి నుంచి అయ్యప్ప మాలధారులకు ఉచిత సద్ది

గురజాల: నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం పల్నాడు యాదాద్రి శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు ఉచిత సద్ది ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి నవంబర్ 18వ తేదీ వరకు 41 రోజుల పాటు సద్దిని ఉచితంగా మాలధారులకు అందిస్తామని, పూర్తి వివరాలకు 9949646205, 6300153587 నంబర్లను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

రక్తదానం చేసిన దాతలు

దాచేపల్లి: నడికుడి సచివాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ కె.శ్రీనివాస్ యాదవ్, కమిషనర్ జి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ శిబిరంలో 50 మందికిపైగా దాతలు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, రక్తదానం చేయటం వలన ప్రమాదాల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. స్థానికులు పాల్గొన్నారు.

గడ్డి మందు పిచికారీపై ఫిర్యాదు

మాచవరం: కాపు దశలో ఉన్న మిర్చి పంటపై గడ్డి మందు పిచికారీ చేసిన ఘటన మండలంలోని మొర్జంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి మిర్చి పంటపై అదే గ్రామానికి చెందిన పేరం నరసింహారెడ్డి అనే వ్యక్తి గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట నష్టం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి

మాచవరం: మండలంలోని పిన్నెల్లి, చెన్నాయపాలెం, పిల్లుట్ల గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిన్నెల్లిలో వాల్మీకి మహర్షి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నాయపాలెంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి చిత్రపటాలను ట్రాక్టర్లపై ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వాల్మీకి సంఘ పెద్దలు, యువజన సంఘ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పరిశుద్ధ జపమాల మాత పండుగ



రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చిలో పరిశుద్ధ జపమాల మాత పండుగ వేడుకలను విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై పరిశుద్ధ జపమాల మాతతో చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు జపమాల మాతను వేడుకొనుచూ ప్రార్థిస్తే ఆ కుటుంబంలో శాంతి సమాధానాలు.. సుఖసంతోషాలు ఉంటాయన్నారు. అనంతరం ఫాదర్ ప్రసన్నకుమార్, భక్తులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ వేడుకలలో చర్చి సహాయ గురువులు రె.ఫాదర్ ప్రసన్నకుమార్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు... స్తంభించిన రాకపోకలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- ముంపునకు గురైన పంట పొలాలు



ఏడుమంగళం వాగు పొంగి ప్రవహించడంతో ముంపునకు గురైన వరి పంట

రెంటచింతల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. సోమవారం 28.6 మి.మీ. మంగళవారం 45.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ పరిశీలికులు తెలిపారు. ఆగస్టులో మొత్తం 150 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటికే 170 మి.మీ., సెప్టెంబర్‌లో 136 మి.మీకు 162 మి.మీ వర్షపాతం నమోదు కావడం జరిగిందన్నారు. అక్టోబర్‌లో 160 మి.మీకు నెల మొదటి వారంలోనే 74 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న అతి భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాలలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు ముంపునకు గురై రైతులు అవస్థలు పడుతున్నారు.

ప్రమాదభరితంగా వాగులు

గోలి గ్రామ శివారులోని గోలి వాగు బ్రిడ్జిపై 6 అడుగుల మేర వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొన్ని గంటలకుపైగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- కొత్త పాలువాయి-పాత పాలువాయి గ్రామాల మధ్య, పశర్లపాడు గ్రామ సమీపంలో పిల్లివాగు పొంగి ప్రమాదభరితంగా ప్రవహించడంతో సోమవారం రాత్రి 9 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. + ఏడుమంగళం వాగు పొంగి ప్రవహించడంతో రెంటాల, రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి గ్రామాలలో సుమారు 60 ఎకరాలకు పైగా వరి పంట ముంపుకు గురైనట్లు రైతులు వాపోయారు.
- మిట్టగుడిపాడు గ్రామ శివారులో నేంద్రవాగు పొంగడంతో కొంత సమయం గోలి, మిట్టగుడిపాడు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకం ప్రమాదభరితంగా పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్దకు వెళ్లి స్థానిక అధికారులకు పలు సూచనలు చేసి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని కోరారు.

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: పట్టణంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కుంభ వృష్టి వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చంద్రవంక వాగు పొంగి పొర్లడంతో మాచర్ల నుంచి జమ్మలమడక వెళ్లే రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి, పుసులూరు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాగర్ రింగ్‌రోడ్డు, బస్టాండ్, నెహ్రూనగర్, పలు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. డ్రెయినేజీ పొంగి మురుగునీరంతా రోడ్లపైకి చేరడంతో దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు



కొత్త పాలువాయి, పాత పాలువాయి గ్రామాల మధ్య ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న పిల్లివాగు



పొంగి పొర్లుతున్న చంద్రవంక వాగు

వర్షాలతో అల్లాడుతున్న రైతులు



పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

పిడుగురాళ్ల: అకాల వర్షాలకు రైతులు అతలాకుతలం అవుతున్నారు. ఎప్పుడు వర్షం ఆగుతుందా పంటలను కాపాడుకుందామా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం మొత్తం ఎండ.. సాయంత్రం అయ్యేసరికి మబ్బులు కమ్ముకొని వర్షాలు పడుతుండటంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ముందుగా వేసిన పత్తి పంట పూర్తిగా నష్టపోవటంతో రైతులు పత్తి పంటను పీకేసి ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. అంతేకాకుండా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మిరప పంట పొలాల్లో నీరు నిలబడటం, మరికొన్ని పొలాల్లో మొక్కలు నేలవాలిపోయాయి. దీంతో రైతులు పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే నీట మునిగిన పొలాలు, నేలవాలిన పొలాల్లో ఏమైనా తెగుళ్లు వ్యాప్తి చెందుతాయేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. నీట మునిగిన, నేలవాలిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు



పిడుగురాళ్ల: గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సీజేఐ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారుస్వామి మాట్లాడుతూ... న్యాయవాదులపై దాడులు చేయటం సమంజసం కాదని, దీనిని ఎవరైనా ఖండించాల్సిందేనని అన్నారు. న్యాయ వ్యవస్థ మీద జరిగిన దాడిని ఖండించాలన్నారు. అనంతరం విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల దాసు, షేక్ మౌలాలి, పి.మణి, పి.నవ్య, లోకేశ్వరి, మందా జాకబ్, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌వీఎస్ కోటేశ్వరరావు, అయాజ్ అహమ్మద్, వెలిశల రామకృష్ణ, సాగర్, ప్రశాంత్ నాయక్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

దాచేపల్లి: స్థానిక సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పేరెంట్స్ అసోసియేషన్ స్కూల్‌కు నిత్యావసర సరుకులను వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు ఉడుతా రాఘవన్, దివ్య దంపతుల కుమారుడు ధీరజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు 15 రోజులకు సరిపడే సరుకులను నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తగరం ఆనంద్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి, మండల శాఖ అధ్యక్షుడు పి.రాజారావు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌ఎఫ్‌కు ‘స్వచ్ఛాంధ్ర’ అవార్డు



స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకున్న ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రతినిధులు



స్వచ్ఛ పురస్కారం అందుకున్న ఆంధ్రా సిమెంట్స్ ప్రతినిధులు



స్వచ్ఛ పురస్కారం అందుకున్న చెట్టినాడ్ సిమెంట్స్ ప్రతినిధులు

మాచర్ల: స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగంగా మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ స్లమ్ (ఎస్‌ఎల్‌ఎఫ్) ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డును సాధించింది. హోమ్ కంపోస్టింగ్ నిర్వహణ, టెర్రస్ గార్డెన్‌లో మొక్కల పెంపకం వంటి పర్యావరణహిత కార్యక్రమాల్లో చూపిన కృషికి ఈ అవార్డు దక్కింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో, జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు చేతుల మీదుగా నెహ్రూనగర్ ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృత్తిక శుక్లా మాట్లాడుతూ, ‘పారిశుద్ధ్యం’ హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్ నిర్వహణలో మాచర్ల నెహ్రూనగర్ ఎస్‌ఎల్‌ఎఫ్ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌ఎఫ్ సభ్యుల కృషిని అధికారులు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కేసీపీ జీఎం వెంకటరమణ, మెప్మా సీడీఎం, సీఓ అంజలి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా, చెట్టినాడ్ సిమెంట్స్‌కు స్వచ్ఛ పురస్కారాలు

దాచేపల్లి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతకు కృషి చేసిన దాచేపల్లి మండల పరిధిలోని రెండు సిమెంట్ పరిశ్రమలకు స్వచ్ఛ పురస్కారాలు దక్కాయి. మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంధ్రా సిమెంట్స్(సాగర్ సిమెంట్స్ గ్రూప్), మండలంలోని పెదగార్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని చెట్టినాడ్ సిమెంట్స్ పరిశ్రమలు స్వచ్ఛత పురస్కారాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అందుకున్నట్లు ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఆంధ్రా సిమెంట్స్(సాగర్ సిమెంట్స్ గ్రూప్) తరపున ప్లాంట్ హెడ్ సుబ్బారావు, చెట్టినాడ్ సిమెంట్స్ తరపున ప్లాంట్ హెడ్ సీతారాములు ఈ పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రా సిమెంట్స్ ప్రతినిధులు మణిప్రసాద్, శంకర్‌నారాయణరెడ్డి, రామకృష్ణ, చెట్టినాడు సిమెంట్స్ ప్రతినిధులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మాచవరం: ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాచవరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దేరంగుల వెంకయ్య (80) ఈ నెల 4న ఇంటి ముందు అరుగుపై కూర్చుని ఉండగా, గ్రామానికి చెందిన నల్లబోతుల శ్రీనివాసరావు ట్రాక్టర్ ద్వారా మట్టి తోలుతుండగా, ప్రమాదవశాత్తూ వెంకయ్యకు ట్రాక్టర్ తగిలి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. మృతుని కుమారుడు దేరంగుల నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

చైల్డ్ రైట్స్‌పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి

చైల్డ్ రైట్స్ డీసీపీయూ కౌన్సిలర్ శ్రీనివాసరావు



పిడుగురాళ్లరూరల్: చైల్డ్ రైట్స్‌పై ప్రతి తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ రైట్స్ డీసీపీయూ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని అంగన్‌వాడీ స్కూల్‌లో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. వారికి ఏ సమస్య తలెత్తినా వెంటనే 1098 నంబర్‌కు డయల్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు మంగళవారం తెలిపారు. సమావేశానికి పురపాలక సంఘం చైర్మన్ మదార్ సాహెబ్ అధ్యక్షత వహిస్తారని, స్థానిక ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు తప్పక హాజరు కావాలన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



విజయవాడ తరలివెళుతున్న ఫ్యాప్టో నేతలు



ధర్నాకు తరలివెళ్తున్న ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబిరాణి, సంఘ నాయకులు



విజయవాడకు తరలివెళ్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు

మాచర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. మంగళవారం ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు విజయవాడ తరలివెళ్లారు. ఫ్యాప్టో పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్ము కిషోర్, టి.రాజశేఖర్, రెహమాన్, సుధాకర్, శ్రీను, హరినాయక్, నాగరాజు, డేవిడ్‌రాజు, మధు, జబ్బార్, ముక్కటి తదితరులు ఉన్నారు.

ఫ్యాప్టో ధర్నాకు తరలివెళ్లిన ఉపాధ్యాయులు

రెంటచింతల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో తలపెట్టిన ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబిరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడిచినా ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చి అటకెక్కించిందని, ఇంతవరకు ఒక్క డీఏ జాడ కూడా లేదని విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసే యాప్‌లు తగ్గిస్తామని చెప్పి ఇంకా యాప్‌ల భారం పెంచి తీవ్ర పని ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు విజయవాడలో ఈ ధర్నాను చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఎస్టీయూ సంఘ మండల కార్యదర్శి ఖుద్దూస్, ఆర్థిక కార్యదర్శి వెంకటేష్, సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వెంగయ్య, గురజాల నాయకులు జాస్తి అప్పారావు, పూర్ణచంద్రరావు, అమర్, వసంత్, అమర నాగేశ్వరరావు, వెంకటరావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం

మాచర్ల రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేస్తామని ఫ్యాప్టో సంఘ నాయకులు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరగనున్న ధర్నాకు తరలివెళ్తూ వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా ఉపాధ్యాయులకు అందించాల్సిన న్యాయమైన డిమాండ్లను ఇంత వరకు అందించలేదన్నారు. విద్యారంగంలో ఆర్థిక సమస్యలు పరిష్కరించి బోధనేతర పనులను నిలిపివేసి, ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించటంతో పాటు పెండింగ్ డీఏలు, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు తాటి రాజశేఖర్, షేక్ సిలార్ అహ్మద్, నాసర్‌రెడ్డి, కృష్ణారావు, రామారావు, మధుసూదనరావు, జబ్బార్, కేశవరెడ్డి, ఎక్సమస్ జాన్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు పైపులైన్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నగర పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో ‘సమస్యలతో సతమతం’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకటేశ్వర్లు, ఏఈ రామునాయక్ స్పందించారు. నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డులో ప్రజలకు తాగునీటిని అందించేందుకు మంగళవారం పైపులైన్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. ఆరునెలల క్రితం నడికుడి-నారాయణపురం రోడ్డు విస్తరణ కోసం రోడ్డుని తవ్వి రోడ్డు వెంట ఉన్న పైపులైన్లను తొలగించారు. ఆరు నెలలుగా తాగునీటి కోసం ఈ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలగించిన పైపులైన్ల స్థానంలో తిరిగి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల్లో ఈ పైపులైన్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందిస్తామని కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ రామునాయక్‌లు తెలిపారు. సాక్షి కథనంతో నగర పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్లు ఏర్పాటు చేయటం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజమణి

దాచేపల్లి: పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని లాంఫాం శాస్త్రవేత్త రాజమణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడి సచివాలయంలో ప్రపంచ కాటన్ డే దినోత్సవం సందర్భంగా పత్తి పంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాజమణి మాట్లాడుతూ పత్తి పంటలో పూత, పిందెలు రాలకుండా ప్లానోఫిక్స్ లేక ఎన్ఏఏ ద్రావణాన్ని పిచికారీ చేయాలని, అధిక వర్షాలకు మారిన పత్తి మొక్కలకు యూరియా 2 శాతం లేక 19-19-19 లేక 13-0-45 ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చు పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని కీటక శాస్త్రవేత్త రాజేష్ చెప్పారు. గులాబీరంగు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చాముండేశ్వరి, నాగజ్యోతి, రాణి, శ్రీకాంత్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో వీరయ్య, సొసైటీ చైర్మన్ తంగెళ్ల శ్రీనివాసరావు, డీసీ పగడాల భాస్కర్‌రావు, స్థానికులు పుల్లయ్య, శ్రీరాములు, నారాయణ, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగి ఉండాలి

అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణ శాస్త్రి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ నారాయణ శాస్త్రి

పిడుగురాళ్ల: విద్యార్థులు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగి, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణ శాస్త్రి అన్నారు. పట్టణ శివారులోని ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలో విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో వివరించాలని, అంతేకాకుండా జీఎస్టీ తగ్గింపు ధరలకు వస్తువులను కొనుగోలు చేస్తున్నామా లేదా, పాత జీఎస్టీ ధరకే కొనుగోలు చేస్తున్నామో అవగాహన ఉంటే అర్థమవుతుందన్నారు. అనంతరం జీఎస్టీపై విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీటీవో టి.పీటర్‌బాబు, ప్రిన్సిపాల్ పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందింది



మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల రూరల్: ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన హిందూ సంప్రదాయాలను కొనసాగిస్తున్న ఆర్ఎస్ఎస్ సేవలు మరువలేమని వివేకానంద ట్రస్టు చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలుగా 81 వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తి, క్రమశిక్షణ గల వ్యక్తులుగా తీర్చిదిద్దిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ప్రతాప సింహ శాస్త్రి మాట్లాడుతూ దేశం కోసం, హిందువులను కలపటం కోసం పట్టణ, గ్రామాల్లో ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే యోచనలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కన్నెకంటి కోటేశ్వరరావు, కొరటా మల్లిఖార్జునరావు, చుండూరు సురేష్, రాజశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.